

నర్సంపేట, వరంగల్ తూర్పు, పశ్చిమ అసెంబ్లీ నియోజకవర్గాల గ్రాడ్యుయేట్స్ సన్నాహక సమావేశాల్లో మాట్లాడుతున్న కేటీఆర్, చిత్రంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, బస్వరాజు సారయ్య, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ మంత్రి ఎర్రబెల్లి, బీఆర్ఎస్ నాయకులు ఆర్ఎస్పీ, వినయభాస్కర్, ధర్మారెడ్డి, నరేందర్, బాల్క సుమన్, నారదాసు, యాదవరెడ్డి, సతీశ్ తదితరులు

# తెలంగాణలో కాంగ్రెస్ చీకటి

> మొదటిపేజీ తరువాయి...

భాగంగా కేటీఆర్ బుధవారం నర్సంపేట, వరంగల్ తూర్పు, వరంగల్ పశ్చిమ అసెంబ్లీ నియోజకవర్గాల గ్రాడ్యుయేట్స్ సన్నాహక సమావేశాల్లో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వడ్లకు క్వింటాకు రూ.500 చొప్పున బోనస్ ఇస్తామన్న కాంగ్రెస్ పార్టీ హామీ బోగస్‌గా మారిందని, ఇప్పుడు సన్న వడ్లకే ఇస్తామంటూ రైతులను మోసం చేశారని మండిపడ్డారు. అసెంబ్లీ ఎన్నికల ముందు ఆరు గ్యారెంటీలు, 420 హామీలతో అరచేతిలో వైకుంఠం చూపి, అధికారంలోకి రాగానే రైతులు, మహిళలు, యువత.. ఇలా అన్ని వర్గాలను మోసం చేసిందని ధ్వజమెత్తారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ మాటలకు మోసపోయి ఓటు వేస్తే, ఇప్పుడు మనల్ని పదేండ్లు వెనక్కి తీసుకుపోయిందని విమర్శించారు. రైతుబిడ్డలైన గ్రాడ్యుయేట్లు రేవంత్‌రెడ్డి మాటలను నమ్మి మోసపోవద్దని పిలుపునిచ్చారు.

## రైతులను మోసం చేసిన రేవంత్

రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కూలీలకు ఆశలు పెట్టిన రేవంత్‌రెడ్డి వారిని ఘోరంగా మోసం చేశారని కేటీఆర్ విమర్శించారు. డిసెంబర్ 9న రూ.2 లక్షల రుణమాఫీ చేస్తానని చెప్పిన రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చి ఆరు నెలలు కావస్తున్నా రుణమాఫీ చేయలేదని మండిపడ్డారు. కేసీఆర్ ప్రభుత్వంలో వరి నాట్ల సమయంలోనే రైతుబంధు పడేదని, రేవంత్‌రెడ్డి మాత్రం ఓట్లు ఉన్నప్పుడే వేస్తున్నారని దుయ్యబట్టారు. రైతుభరోసా ఎకరాకు రూ.15 వేలు ఇస్తామని చెప్పి మోసం చేశారని విమర్శించారు. ఇప్పుడు విత్తనాలు, ఎరువులు, నీళ్లు, కరెంట్ అన్నింటికీ ఇబ్బంది పడే పరిస్థితి వచ్చిందని చెప్పారు. 'కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో వడ్లకు క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామన్నరు. దొడ్డు వడ్ల ఎంఎస్పీ రూ.2,183కి రూ.500 కలిపి రూ.2,686 ఇస్తామని మ్యానిఫెస్టోలలో రాసిండ్లు. ఇప్పుడేమో సన్నవడ్లకే ఇస్తామని సన్నాయినొక్కులు నొక్కుతున్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేయాలని అడిగేవారు శాసనమండలిలో ఉండాల్నా? రేవంత్‌రెడ్డి చెప్పే మాటలకు సన్నాయి నొక్కులు నొక్కేవారు ఉండాల్నా? విద్యావంతులు ఆలోచించాలి' అని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.



### మానవత్వం చాటుకున్న కేటీఆర్

గీసుగొండ, మే 22: ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా వరంగల్ నుంచి నర్సంపేటకు వెళ్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మానవత్వం చాటుకున్నారు. గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ ధర్మారం అంబేద్కర్ సెంటర్ వద్ద వడదెబ్బతో అంజయ్య రోడ్డు పక్కన పడిపోయి ఉండటంతో అది గమనించిన కేటీఆర్ తన వాహనాన్ని ఆపారు. అతను ఆసస్మారక స్థితిలో ఉండటంతో వెంటనే తన కాన్వాయ్‌లోని వాహనంలో వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు. దగ్గరుండి అతనికి చికిత్స అందేలా చూడాలని తనతోపాటు ఉన్న పోలీసులను కోరారు.

## వరంగల్ నుంచి ఐటీ పోయింది

హైదరాబాద్‌తోపాటు వరంగల్‌లోనూ ఐటీ పరిశ్రమల విస్తరణకు బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేసిందని, కాంగ్రెస్ వచ్చిన తర్వాత ఇక్కడి ఐటీ పరిశ్రమలు బయటకు పోతున్నా పట్టించుకోవడం లేదని కేటీఆర్ విమర్శించారు. తాను ఐటీశాఖ మంత్రిగా ఉన్నప్పుడు హనుమకొండలో ఐదు ఐటీ కంపెనీలు ఒకే రోజు ప్రారంభించానని, కానీ ఇప్పుడు ఇక్కడ ఉన్న టెక్ మహీంద్ర తట్టాబుట్టా సర్దుకుని హైదరాబాద్‌కు వెళ్లే పరిస్థితిని కాంగ్రెస్ తీసుకొచ్చిందని మండిపడ్డారు. 'కాకతీయ కళాతోరణం, చార్మినార్ రాచరికానికి పోకడగా ఉన్నాయని రాజముద్ర నుంచి వాటిని తీసేస్తానని రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో చెప్పారు. 'జయ జయ హే'ను తెలంగాణ గీతం చేస్తామని చెప్పారు. అసలు ఆ పాటలో ఏమున్నదో రేవంత్‌రెడ్డికి తెలియదు. కాకతీయ కళాప్రభల కాంతిరేఖ రామప్ప, గోల్కొండ నవాబుల గొప్ప వెలుగు చార్మినార్' అని కేటీఆర్ వివరించారు. రేవంత్‌రెడ్డి పెట్టిన రాష్ట్ర గీతంలోనే చార్మినార్, రామప్ప, కాకతీయ తోరణం ఉన్నదని గుర్తుచేశారు. చార్మినార్ రాజముద్రలో ఉండొద్దనే సన్నాసులకు ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

## రేవంత్ ఇచ్చింది గాడిద గుడ్డే

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి రెండు ఉద్యోగాలు కూడా ఇయ్యలేదని కేటీఆర్ మండిపడ్డారు. ఒక్క నోటిఫికేషన్ కూడా ఇయ్యకుండానే 30 వేల ఉద్యోగాలిచ్చామని చెప్పుకుంటున్నారని, రేవంత్‌రెడ్డి ఇచ్చింది గాడిద గుడ్డు మాత్రమేనని ఎద్దేవా చేశారు. కేసీఆర్ ఇచ్చిన ఉద్యోగాలను తాను ఇచ్చినట్టుగా రేవంత్‌రెడ్డి కటింగ్ ఇస్తున్నరని దుయ్యబట్టారు. నోటిఫికేషన్ ఇయ్యకుండా, పరీక్ష పెట్టకుండా ఉద్యోగాలు ఎక్కడైనా ఇస్తరా? అని ప్రశ్నించారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు జాబ్‌ల పరీక్ష ఫీజులు వసూలు చేయొద్దని రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కాగానే టెట్ ఫీజును రూ.2 వేలకు పెంచారని ఆగ్రహం వ్యక్తంచేశారు. రేవంత్‌రెడ్డి యువతకు ఉద్యోగాలు ఇవ్వాలని ఆలోచించడం లేదని, పార్లమెంట్ ఎన్నికల తర్వాత తన జాబ్ ఏమైతదోనని రంది పట్టుకున్నదని ఎద్దేవా చేశారు. బీజేపీలోకి పోవాల్నా, ఎటు పోవాల్నా? అని రేవంత్‌రెడ్డి ఆలోచిస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ చెప్పిన ఆరు గ్యారెంటీల్లో ఒక్క ఫ్రీ బస్సు తప్ప ఏదీ అమలు కాలేదని పేర్కొన్నారు. రద్దీ బస్సులు ఎక్కలేక, సీట్లు దొరక్క మహిళలు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. 'మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తున్నామని ప్రియాంకగాంధీ, రాహుల్‌గాంధీ చెప్తున్నారు. ఎవరికైనా అందుతున్నాయా? రైతుభరోసా వచ్చిందా? పంట రుణాలు మాఫీ అయ్యాయా?' అని ప్రశ్నించారు.

## ఇటు బిట్స్ పిలానీ.. అటు పల్లీ బఠానీ!

బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి గెలిస్తే ఇక్కడకు పారిశ్రామికవేత్తలను తీసుకొచ్చి ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పిస్తారని కేటీఆర్ భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ అభ్యర్థి మల్లన్న గెలిస్తే చంచల్‌గూడలో ఉన్న తన సీనియర్లను పిలిపించి మాట్లాడిస్తడని ఎద్దేవా చేశారు. రాజకీయాలపై ఇప్పటికే చాలామందిలో ప్రతికూల అభిప్రాయం ఉన్నదని, దానిని మార్చాలని పిలుపునిచ్చారు. క్రిమినల్ రికార్డు ఉన్నవారికి పట్టం కడితే, చట్టసభల్లో ఇలాంటివారు దూరితే ఎలా ఉంటుందో ఆలోచించాలని విజ్ఞప్తిచేశారు. కేసీఆర్ హయాంలో బండా ప్రకాశ్, సిరికొండ మధుసూదనాచారి, బస్వరాజు సారయ్య, పోచంపల్లి శ్రీనివాస్, గిరిజన మహిళ సత్యవతిరాథోడ్, విద్యాసంస్థల అధినేత తక్కళ్లపల్లి రవీందర్‌రావు లాంటివారికి ఎమ్మెల్సీలుగా అవకాశం ఇచ్చారని గుర్తుచేశారు. కానీ, కాంగ్రెస్ అభ్యర్థి ఒక బ్లాక్‌మెయిలర్ అని, తెల్లారితే యూట్యూబ్ చానల్‌లో పెద్దవారనే గౌరవం కూడా లేకుండా ఇష్టం వచ్చినట్టు తిడుతుంటాడని విమర్శించారు. ఇటు బిట్స్ పిలానీ ఉంటే, అటు పల్లీ బఠానీ పోటీలో ఉన్నారని వివరించారు. బిట్స్ పిలానీలో గోల్డ్‌మెడల్ సాధించిన రాకేశ్‌రెడ్డి ఏడేండ్లు ఫేస్‌బుక్, సిటీ బ్యాంకులో పనిచేసి, రైతుబిడ్డగా వరంగల్‌కు వచ్చి సేవ చేయాలనుకున్నారని చెప్పారు. చదువుకున్న రాకేశ్‌రెడ్డికి ఓటు వేస్తారా? చంచల్‌గూడ వ్యక్తికి ఓటు వేస్తారో ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల గొంతుకగా ప్రశ్నించడానికి రాకేశ్‌రెడ్డిని శాసనమండలికి పంపించాలని పిలుపునిచ్చారు. సర్కారుకు బాకా ఊదేవారిని కాకుండా తప్పులపై శాసనమండలిలో బాజా బజాయించే వారిని పంపించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, ఎమ్మెల్సీలు సిరికొండ మధుసూదనాచారి, బస్వరాజు సారయ్య, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు సంజయ్‌కుమార్, కల్వకుంట సంజయ్, పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, తాటికొండ రాజయ్య, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, మారెపల్లి సుధీర్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయభాస్కర్, చల్లా ధర్మారెడ్డి, పెద్ది సుదర్శన్‌రెడ్డి, నన్నపునేని నరేందర్, బాల్క సుమన్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, మాజీ చైర్మన్లు మర్రి యాదవరెడ్డి, కే వాసుదేవరెడ్డి, సర్దార్ రవీందర్‌సింగ్, జీవీ రామకృష్ణారావు, వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఇది అహంకారికి, ఆశయానికి మధ్య ఎన్నిక: ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నిక అహంకారికి, ఆశయానికి మధ్య జరుగుతున్న ఎన్నిక అని బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. ఏనుగుల రాకేశ్‌రెడ్డి విద్యావంతుడు, ఆశయం ఉన్న వ్యక్తి అని కొనియాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఏ మాత్రం విలువలు లేని తీన్మార్ మల్లన్నను తీసుకొచ్చి ప్రజలపై రుద్దాలని చూస్తున్నారని ఆరోపించారు. కరోనా వైరస్ లాంటి వ్యక్తి తీన్మార్ మల్లన్న అని విమర్శించారు. ప్రైవేట్ వ్యక్తుల, ఎమ్మెల్యేల ఫోన్ ట్యాపింగ్, పోలీస్ కానిస్టేబుళ్లతో కొట్లాట, ఫొటోల మార్ఫింగ్ లాంటి వాటికి సంబంధించి 56 కేసులు ఉన్నాయని, 70 రోజులు జైలుకు వెళ్లాడని వివరించారు. ఇలాంటి వ్యక్తి పట్టభద్రులకు ఎలా ప్రతినిధి అవుతారని ప్రశ్నించారు. ఓటు హక్కుతో దుర్మార్గులను ఓడించి, నిత్యం ప్రజల మధ్య ఉంటూ, ప్రశ్నించే తత్వం ఉన్న విద్యావంతుడు రాకేశ్‌రెడ్డిని గెలిపించాలని కోరారు.

## ఎమ్మెల్సీగా రాకేశ్‌రెడ్డిని గెలిపిద్దాం

- **ఆయన విద్యావంతుడు.. సమాజసేవకుడు**
- **సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ ఎక్స్ వేదికగా పట్టభద్రులకు విజ్ఞప్తి**



హైదరాబాద్, మే22 (నమస్తే తెలంగాణ): రాజకీయాల్లోకి యువత, నీతి నిజాయితీ ఉన్న వ్యక్తులు రావాలని, మోసగాళ్లు, స్వార్థపరులు, అవినీతి పరులు వస్తే మొత్తం సమాజమే నష్టపోతుందని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ అభిప్రాయపడ్డారు. విద్యావంతుడు, సమాజసేవకుడు, బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తన మిత్రుడు ఏనుగుల రాకేశ్‌రెడ్డిని వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలిపించాలని ఎక్స్ ఖాతా వేదికగా బుధవారం ఆయన విజ్ఞప్తి చేశారు. రైతుకుటుంబంలో పుట్టి, బిట్స్ పిలానీలో గోల్డ్‌మెడల్ సాధించి అమెరికా అవకాశం వదులుకొని సమాజం కోసమే రాకేశ్‌రెడ్డి రాజకీయాల్లోకి వచ్చారని తెలిపారు. వరంగల్‌లో వరదలు వచ్చిన సమయంలో ప్రజలకు బాసటగా నిలిచారని, యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు కృషి చేశారని గుర్తుచేశారు. పట్టభద్రులు మొదటి ప్రాధాన్యతగా ఏనుగుల రాకేశ్‌రెడ్డికి ఓటేయాలని విజ్ఞప్తి చేశారు.

# బీసీ సంఘాల మెరుపు ధర్నా

- **స్థానిక సంస్థల్లో బీసీలకు 42 % రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్**
- **బీసీల రాజకీయ అవకాశాలను కాలరాస్తే కాంగ్రెస్‌కు గుణపాఠం**
- **బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాంయాదవ్ హెచ్చరిక**

కవాడిగూడ, మే 22: లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద బీసీ జనసభ ఆధ్వర్యంలో స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ పలు బీసీ సంఘాల ప్రతినిధులు బుధవారం మెరుపు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాం యాదవ్ మాట్లాడుతూ.. కామారెడ్డి డిక్లరేషన్ సందర్భంగా కర్ణాటక సీఎం సిద్దరామయ్య ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌కు కాంగ్రెస్ కట్టుబడి ఉండాలని డిమాండ్ చేశారు. లోక్‌సభ ఫలితాల తర్వాత ఎలాంటి రిజర్వేషన్లు కల్పించకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. కులగణన, సామాజిక న్యాయం పేరుతో అసెంబ్లీ ఎన్నికల్లో లబ్ధి పొందిన కాంగ్రెస్.. వాటిని విస్మరించి మరోసారి బీసీలను మోసం చేసేందుకు సిద్ధమైందని విమర్శించారు. బీసీలకు రిజర్వేషన్ కల్పించకుండా ఎన్నికలు నిర్వహిస్తే ఓటు ద్వారా బుద్ధి చెప్పి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఇక్కడ ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కరుణాకర్‌ముదిరాజ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అల్లంపల్లి రాంకోటి, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రామ్మూర్తిగౌడ్, జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల కృష్ణ, బీసీ విద్యార్థి సంఘాల జేఏసీ చైర్మన్ దత్తాత్రేయ, నాయకులు రాజు , గోవర్ధన్, వెంకట్‌నేత, బీసీ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ కర్నాడి శ్రీనివాస్, విద్యార్థి నిరుద్యోగ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కొంపల్లి రాజు, బీసీ సంఘాల నేతలు పాల్గొన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వకుండా ఎన్నికలకు వెళ్తే జూన్ 8న మహాధర్నా నిర్వహించడంతోపాటు 15న సచివాలయాన్ని ముట్టడిస్తామని రాజారాంయాదవ్ హెచ్చరించారు. కులగణన పేరుతో ఎన్నికల్లో లబ్ధిపొందిన కాంగ్రెస్ మరోసారి బీసీలను వంచించేందుకు సిద్ధమైందని దుయ్యబట్టారు. దశాబ్దాల సామాజికవర్గాల న్యాయమైన డిమాండ్‌కోసం తెలంగాణ ఉద్యమం తరహాలో మరో పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.



లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహిస్తున్న బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారామ్ యాదవ్‌తో పాటు పలు బీసీ సంఘాల నేతలు

### రిజర్వేషన్ల అమలు తర్వాతే ఎన్నికలు పెట్టాలి

- **బీఆర్ఎస్ నేత గట్టు రాంచందర్ రావు డిమాండ్**



హైదరాబాద్, మే 22 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో ప్రకటించినట్టు 42 శాతం రిజర్వేషన్ అమలుచేసిన తర్వాతే రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీఆర్ఎస్ నేత గట్టు రాంచందర్‌రావు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు బీసీ డిక్లరేషన్ పేరుతో అనేక హామీలు ఇచ్చిందని, వాటిలో ఒక్కటి కూడా అమలు కాలేదని విమర్శించారు. బుధవారం తెలంగాణభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కామారెడ్డిలో అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌లో స్థానిక సంస్థల రాజకీయ రిజర్వేషన్లను 23 శాతం నుంచి 42 శాతానికి పెంచుతామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. బీసీల సంఖ్యారీత్యా 55 శాతం రిజర్వేషన్లు అమలు కావాల్సి ఉన్నదని చెప్పారు. జనాభా దామాషా ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. సివిల్ కాంట్రాక్టుల్లో బీసీలకు 42 శాతం, వైన్స్‌లో గౌడ కులస్థులకు 23 శాతం రిజర్వేషన్లు ఇస్తామన్నారని, ఇప్పుడు ఆ ఊసే లేదని మండిపడ్డారు. బీసీ డిక్లరేషన్ అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే బీసీల ఆగ్రహానికి గురికాక తప్పదని గట్టు హెచ్చరించారు.

## పెండింగ్ బిల్లులు ఇచ్చాకే ఎన్నికలు నిర్వహించండి

- **రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం డిమాండ్**
- **ఈసీ పార్థసారథికి వినతి**
- **సర్కార్ స్పందించడంలేదని ఆవేదన**

హైదరాబాద్, మే 22 (నమస్తే తెలంగాణ): 'ఊర్లను అభివృద్ధి చేయాలన్న ఆకాంక్షతో సొంతంగా డబ్బులు ఖర్చుపెట్టి పనులు చేయించినం. పెండింగ్ బిల్లుల విషయంలో ప్రభుత్వానికి ఎన్నిసార్లు వినతి పత్రాలు ఇచ్చినా స్పందించడంలేదు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నం. మీరైనా స్పందించి బిల్లులు చెల్లించాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించండి' అని ఎన్నికల కమిషనర్ పార్థసారథిని రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం కోరింది. బుధవారం మాసబ్‌ట్యాంక్‌లోని ఎన్నికల సంఘం కార్యాలయంలో కమిషనర్‌కు వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, జేఏసీ అధ్యక్షుడు యాదయ్య మాట్లాడుతూ వైకుంఠధామాలు, పల్లెప్రకృతి వనాలు, రైతువేదిక, డంప్‌యార్డు, సీసీ రోడ్లు, క్రీడా ప్రాంగణాలు, మురుగుకాల్వలు, వీధి లైట్లు, పారిశుధ్యం తదితర కార్యక్రమాలను చేపట్టి గ్రామాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దామని, పెండింగ్ బిల్లులు అడిగితే ప్రభుత్వం పట్టించుకోవడం లేదని చెప్పారు. బిల్లులు రాక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. పెండింగ్ బిల్లులు చెల్లించాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలనిడిమాండ్ చేశారు. ప్రధాన కార్యదర్శి ప్రనీల్‌చందర్, ఉపాధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, అమరేందర్‌రెడ్డి, రమేశ్, పంబ కరుణాకర్, రామకృష్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## • జనగామ జోలికొస్తే ఖబడ్దార్



జనగామ జిల్లాను మార్చొద్దని డిమాండ్ చేస్తూ బుధవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద జేఏసీ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీని దహనం చేశారు. జనగామ జోలికి వస్తే ఖబడ్దార్ అంటూ జేఏసీ జిల్లా కన్వీనర్ మంగళంపల్లి రాజు, నాయకులు హెచ్చరించారు. – జనగామ చౌరస్తా


